ప్రతిఫలం

[కథానిక]

— 'జమదగ్ని' —

లెక్కల మాస్టారు వస్తున్నారు!

ఏ కుఱ్ఱాడూ బైటికి వచ్చి తొంగిచూడలేదు. లోపల్లోపల గుసగుసలుకూడా ఏమీ లేవు. అందరూ ఎవరిచోటుల్లో వారు కూర్చుని పుస్తకాలు తెరిచి సిద్ధంగా ఉన్నారు.

అప్పుడే మాస్టారు రానే వచ్చారు.

ఎదురుగుండా హోమ్‌వర్కు పుస్తకాలు పేర్చి పెట్టి ఉన్నాయి. ఆయన వాటిని చూడడంతో కాలక్షేపం చెయ్యలేదు.

'చెయ్యనివాళ్లు ఎవరు?' అని ప్రశ్న వేశారు.

సమాధానంగా ఇద్దరు నిలబడ్డారు. ఒకడు శ్రీమన్నారాయణ, రెండవవాడు గౌడ. వాళ్ళిద్దరూ మామూలుగా చెయ్యనివాళ్లే! తెలివితేటలకు తక్కువా అంటే ఏమీ కాదు. కాని చెయ్యకపోవడానికి పట్టి బద్ధకమే కారణం. ఈ విషయం వాళ్లకూ తెలుసు, ఆయనకూ తెలుసు. అయినా ఆయనకు కోపంరాలేదు.

చేసినవాళ్ళవంక చూసి 'మీలో ఎవరికైనా సందేహాలున్నాయా?' అన్నారు మాస్టారు.

ఎవ్వరూ లేచి నిలబడలేదు.

'అయితే ఈ లెక్క వేసుకుని చెయ్యండి' అని బోర్డు మీద ఒక లెక్క వ్రాశారు. అందరూ వేసుకుంటున్నారు. నిలబడిఉన్న శ్రీమన్నారాయణా, గౌడా మాత్రం ఒకరితో ఒకరు కీచులాడుకుంటున్నారు.

మాస్టారు క్లాసువంక తిరిగిచూచారు. ఇంకెవరికైనా అయితే కోపం వచ్చేదే! ఆయన మాత్రం శ్రీమన్నారాయణను పిలిచి లెక్క చదవమన్నారు. అతను చదివాడు.

'మనం ఏం కనుక్కోవాలి ఇందులో?'

'అన్నరు కనుక్కోవాలి సార్'

ఈ ముక్క అని ఒక్కమాటు శ్రీమన్నారాయణ క్లాసువంక చూచాడు. అందరూ నవ్వుతారను కున్నాడు పాపం! కాని వాళ్ళంతా లెక్క చేసుకుంటున్నారు. ఒక్క గౌడ మాత్రం వాడన్న మాటకు నవ్వుకుంటున్నాడు.

'ఏమోయ్! అంతేనా గౌడా?' అన్నారు మాస్టారు.

గౌడకు శ్రద్ధ లేకపోయినా భయమూ, భక్తీ ఎక్కువ. 'కాదు సార్! వెడల్పు కనుక్కోవాలండీ' అన్నాడు.

'దేని వెడల్పు?'

'భూమి వెడల్పు సార్'

'ఎటువంటి భూమి?'

'దీర్ఘ చతురస్రాకారపు భూమి సార్'

'ఏమోయ్! శ్రీమన్నారాయణా! నువ్వేమంటావ్? ఇదేనా కనుక్కోవాలిసింది?'

శ్రీమన్నారాయణ తెల్లమొహం వేశాడు. తెలియకకాదు. క్లాసు అంతా కాకపోయినా గౌడ కూడా తనతో కలిసి రాలేదని. అయితే ఏం చెయ్యగలడు?

'అవునండీ సార్!' అన్నాడు.

'లెక్కలో మనకు ఏమేమి ఇచ్చారు?'

'వైశాల్యం ఇచ్చారండి!'

'దేని వైశాల్యం?'

'భూమి వైశాల్యం ఇచ్చారండి'

'ఇంకా ఏమిచ్చారు?'

'పొడుగు ఇచ్చారండి!'

'అసలు ఇటువంటి భూమియొక్క వైశాల్యం ఏం చేస్తే వస్తుంది?' అన్నారు ఎదురుగుండా ఉన్న బల్ల చూపిస్తూ మాస్టారు.

'పొడుగునూ, వెడల్పునూ ఒకదానిచేత ఒకటి హెచ్చవేస్తే వస్తుందండి'

'కాబట్టి పొడుగూ, వైశాల్యమూ ఇచ్చినప్పుడు వెడల్పు కనుక్కోవాలంటే ఏం చెయ్యాలి?'

'వైశాల్యాన్ని పొడుగుచేత భాగించాలండి'

'ఇచ్చిన వైశాల్య మెంత?'

'ఇరవై అయిదు'

ఇప్పటికి క్లాసులో అందరూ లెక్క చేసేశారు.

శ్రీమన్నారాయణ చెప్పిన సమాధానానికి అందరికీ నవ్వువచ్చింది. కాని పైకి ఎవ్వరూ నవ్వలేదు.

'ఇరవై అయిదేమిటి?'

'మైళ్లు అండి'

ఈమాటు క్లాసు నవ్వు ఆపుకోలేకపోయింది.

'ఈ ఇరవై అయిదు మైళ్లు ఏమిటి?'

'వైశాల్యమండి!'

'వైశాల్యం వట్టి మైళ్లలో ఉంటుందా?'

ఇప్పటికి తెలిసింది శ్రీమన్నారాయణకు క్లాసు అంతా ఎందుకు నవ్వుకుంటున్నారో!

నాలిక కరుచుకొని 'ఇరవై అయిదు చదరపు మైళ్లండి' అన్నాడు.

'పొడుగు ఎంత ?'

'ఆరు మైళ్ళ రెండుఫర్లాంగు లండి'

'అయితే ఏం చెయ్యాలి ?'

శ్రీమన్నారాయణకు పౌరుషం వచ్చేసింది ఎందు కిట్లా ప్రతిదానికీ ప్రశ్న వేస్తాడని. ఈసారి తప్పు చెప్పగూడ దనుకున్నాడు. క్లాసుకీ, మాస్టారికీ గూడా తన తెలివితేటలు చూపించా లనుకున్నాడు. ఆలోచించాడు.

కాసే పుండి 'వైశాల్యాన్ని చదరపుఫర్లాంగుల లోకి మార్చుకుని పొడుగునుగూడా ఫర్లాంగులలోకి మార్చి ఆవచ్చిన పొడుగుచేత వచ్చిన వైశాల్యాన్ని భాగిస్తే వెడల్పు ఎన్నిఫర్లాంగులో తేల్తుందండి.'

'ఏరా అంతేనా గౌడా ?'

'అవునండీ !'

'అయితే ఇద్దరూ చకచకా చేసి చూపించండి' అని వీళ్లతో చెప్పి, మాస్టారు బోర్డుమీద మరొక లెక్క వేసి మిగతావాళ్లని చెయ్యమన్నారు.

ఆయన క్లాసువంక తిరగడంతోటే శ్రీమన్నారాయణ కూర్చునిఉన్నవాడు అమాంతం గానుంచున్నాడు.

ఈ మాటు మాస్టారికి కోపం వచ్చింది. కాని ఆయన తమాయించుకుని 'ఏరా గౌడా! నువ్వు కూర్చుని లెక్కచేసి చూపించరా' అన్నాడు.

శ్రీమన్నారాయణకు పట్టరాని ఉక్రోషం వచ్చింది. గౌడ తల వంచుకుని నవ్వుతూ లెక్క చేస్తున్నాడు.

శ్రీమన్నారాయణఆలోచన అంతా లెక్కమీద లేదు. ఈ మాస్టార్ని తిరిగి అవమానంచెయ్యడ మెల్లాగా అని అతని బుఱ్ఱ లెక్కలేనన్ని పన్నాగాలు పన్నతోంది.

క్లాసులో మిగతావాళ్లు చాలామంది రెండోలెక్క చేసేశారు. కొందరికి సందేహాలు వస్తే ఆ సందేహాలు పోగొట్టేందుకు అనువైన ప్రశ్నలు వేసి వాళ్లచేతనే సమాధానాలు చెప్పించారు మాస్టారు. శ్రీమన్నారాయణ బుఱ్ఱలో ఇవేవీ దూరడమే లేదు. గౌడమాత్రం మొదటి లెక్క చేసి మాస్టారిదగ్గరకు వచ్చాడు. ఆ లెక్క చేసిన విధానం చూసి మాస్టారు చాలా సంతోషించారు. 'గౌడా! నీకు లెక్కల్లో ఫస్టుమార్కు వస్తుంది. నువ్వు కొంచెం శ్రద్ధగా చదివితే చాలు !' అని వాణ్ని ఉబ్బ వేసి 'నువ్వు ఇకనుంచీ ఆ అన్నయ్యపక్కన కూర్చో

బోకు. ఇక్కడ కూర్చో'అని మొదటిబెంచీలో చోటు చూపించారు. లెక్క చేసినవాళ్లందరికీ పుస్తకంలో అభ్యాసంలో కొన్ని లెక్కలు గుర్తుపెట్టించి వాటి నన్నిటినీ క్లాసులో చెయ్యమని, ఇంకా చెయ్యని వాళ్లదగ్గరకు బయలుదేరారు. దామోదర్ లెక్కల పుస్తకం తెరిచేఉందికాని అతను బల్లకింద చెయ్యిపెట్టి వేరుసెనక్కాయలు తింటున్నాడు. మాస్టారు కుర్చీలోంచి లేచారనగానే చేతులు దులుపుకుని ఏమీ ఎరగనట్లు రెండోలెక్క చెయ్యడం మొదలుపెట్టాడు. అతనిదివఱకు రెండుమూడుమాట్లు ఆయనచేతిలో గట్టిదెబ్బలు తిని చదువుమీద శ్రద్ధవహించడం మొదలుపెట్టాడు. మాస్టా రతన్ని చూసీమాడనట్లు ఊరుకున్నారు. మూడోవరసలో నరసింహారావు మాస్టారి రాకను గమనించలేనంత తన్మయత్వంతో 'చోరాగ్రేసర చక్రవర్తి'అని ఒక పుస్తకం గోడకానుకుని చదువుతున్నాడు. మాస్టారు మరోరెండడుగులు వేసేసరికి 'చక్రవర్తి' ఎందుకనో పుస్తకం దింపి ఉలిక్కిపడి నించున్నాడు. వాడి కంగారు చూచేటప్పటికి మాస్టారికి జాలివేసింది.

'పుస్తకం పూర్తిఅయిందా చక్రవర్తిగారూ' అన్నారు మాస్టారు.

ఈమాట విన్న కొందరు కుఱ్ఱాళ్ళు ఫక్కున నవ్వారు.

మాస్టారు ఏం చేస్తారో అని నరసింహారావు గడగడ లాడిపోతున్నాడు.

ఆయ నా పుస్తకం అతని చేతిలోనుంచి తీసుకుని 'ఎక్కడ సంపాదించావోయ్ ఈ పుస్తకం?' అన్నారు.

నరసింహారావు తడబడిపోతూ 'మా పేటలో లైబ్రరీలోదండి' అన్నాడు.

'నువ్వు లైబ్రరీకిగూడా వెళ్తా వన్నమాట! బాగుంది. అయితే మీ లైబ్రరీలో ఇవ్వేనా పుస్తకాలు, ఇంతకన్నా మంచివి ఉంటాయా?'

నరసింహారావుకు కొంచెం ధైర్యం వచ్చింది.

'లేకేమండి? 'బర్మారాణి', 'నేనే నీ మొగుడు', 'రంకుల రాటం' ఇట్లాంటి గొప్పగొప్ప పుస్తకాలు చాలా ఉన్నాయండి.'

'నువ్వివన్నీ చదివావా?'

'చదివా నండి'

అతనికి పుస్తకాలు చదవాలన్న కోరికా, పట్టుదలా ఉన్నందుకు మాస్టారికి సంతోషంవేసింది కాని ఇట్లాంటివే 'గొప్పగొప్పపుస్తకాలు' అనుకుంటున్నందుకు ఆయనమనస్సుకు కష్టంవేసింది.

'అయితే ఈ పుస్తకం నా కొకమాటు ఇయ్యి! ప్రస్తుతం నువ్వు ఆలెక్క వేసి చూపించు. క్లాసు అయింతర్వాత నాదగ్గఱకు ఒకమాటు రా! నీకు సరదాగా ఉంటే నా దగ్గర చాలా పుస్తకాలు ఉన్నాయి, ఇస్తాను, చదువుదుగాని' అని నాలుగోవరసలోకి వెళ్ళిపోయారు మాస్టారు.

నరసింహారావు స్తబ్ధుడైపోయాడు. మాస్టారు తన్ను వేళాకోళంచేస్తున్నారో, నిజంగానే అంటున్నారో గ్రహించలేకపోయాడు. భయంభయంగా లెక్క చెయ్యడం మొదలుపెట్టాడు.

నాలుగోవరసలో శ్రీమన్నారాయణ పుస్తకంలో లెక్క చెయ్యడం మానేసి మాస్టారి బొమ్మ వేస్తున్నాడు. పోలికలుగూడా కుదిరాయి. కాని ఆయన్ని అవమానం చెయ్యాలన్న కుదృష్టి ఉండడంవల్ల దానికి లేనిపోని అలంకారాలన్నీ పెట్టడంతో అది అయ్యవారుమాత్రం కాలేదు.

మాస్టారు దగ్గరకు వచ్చేటప్పటికి శ్రీమన్నారాయణ అందరిమాదిరి కంగారుపడి పుస్తకం ముయ్యలేదు. మాస్టారు పుస్తకంతీసుకుని చూచారు. ఒక్కసారి క్లాసంతటికీ ఆ బొమ్మ చూపించి 'ఇ దెవరి బొమ్మరా?' అని ప్రశ్న వేశారు. ముందుబెంచీలో కూర్చున్న గౌడ 'శ్రీమన్నారాయణదండి' అన్నాడు. క్లాసు అంతా ఒక్కమాటు గొల్లుమన్నారు. శ్రీమన్నారాయణకు వాణ్ని చావగొట్టేదామన్నంత కోపంవచ్చింది. కాని పక్కన మాస్టా రున్నారు. ఏంచెయ్యగలడు? మాస్టారు వాడి ముఖం చూచి 'అంత కోపం ఎందుకురా? వాడికి

తోచింది వాడు చెప్పాడు. నువ్వు వేశావు కాబట్టి నీది. పోనీ నువ్వెవరి దంటావో చెప్పు?' అన్నారు. క్లాసుఅంతా మళ్లీ గొల్లుమన్నారు. దీంతో శ్రీమన్నారాయణకు మరింత కోపం వచ్చింది. ఏం చెప్పడానికీ తోచలేదు.

మాస్టారుగూడా ఆలోచిస్తున్నారు, వీణ్ని ఏంచేస్తే బాగుపడతాడా అని. తెలివితేటలు లేకపోయాయా అంటే ఆ లోప మేమీ లేదు. ఇంటిదగ్గఱ చదువుకు తగిన వాతావరణం లేదా అంటే అదీ కాదు. తండ్రి పెద్ద పేరుమ్రోగిన జిల్లామునసబు. తల్లి కూడా చదువుకున్నదే! తక్కిన పిల్లలందరూ వీడికంటే పెద్దవాళ్లు బాగా చదువుకుని అభివృద్ధిలో ఉన్న వాళ్లేనట! మరి వీడికే విపరీతప్రవృత్తి ఏమిటి? వీడికి చదువుమీద ఎందుకు ఆసక్తి లేకపోవాలి? ఈ చదువులో అనేక లోపాలు ఉండవచ్చుగాక! ఉన్న అవకాశాల్లో ఈ చదువే విద్యార్థుల మనస్సును ఆకర్షించేటట్లు తాను చెయ్యగలుగుతూనే ఉన్నాడే! ఎన్ని చేసినా వీడు మాత్రం మారడం లేదు.

ఇంతలో మాస్టారు ఆలోచన ఆపి 'ఏమోయ్ శ్రీమన్నారాయణా! ఏమంటావ్?' అన్నారు.

శ్రీమన్నారాయణ ఉలిక్కిపడ్డట్టయి చటుక్కున పుస్తకం మూసేశాడు. అటూ ఇటూ కూర్చున్న కుర్రాళ్ళు పొంగివస్తున్న నవ్వు ఆపుకోలేకా, మాస్టారేమంటారో అన్న భయంతో బయటికి నవ్వలేకా, ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. మాస్టారు వాళ్ళని గమనించారు గాని, అంతలో ఏ మాలోచన తోచిందో ఏమో, శ్రీమన్నారాయణను బోర్డుదగ్గరకుతీసుకుపోయి రంగు సుద్దముక్కలు ఇచ్చి 'నువ్వు ప్రస్తుతం లెక్కలు చెయ్యవద్దుగాని బోర్డుమీద నీ ఇష్టంవచ్చిన చక్కని బొమ్మ గియ్యి. ఏం?' అన్నారు. శ్రీమన్నారాయణ పుస్తకంలో ఏం చేశాడో మాస్టారికీ, అతనికీ, అతని పక్కనున్న విద్యార్థులకూ తప్ప ఎవ్వరికీ తెలియదు. మాస్టారిలా అనేటప్పటికి ఆ పక్కనున్న విద్యార్థులు 'ఇదెక్కడి మాస్టారురా!' అని ఆశ్చర్యపడిపోయారు. మరే మాస్టరయినా ఆ పూట వాడు చేసిన పనికి పట్టరాని కోపం వచ్చి చావగొట్టేవాడు. ఈయనకూ కోపం వస్తుంది. ఈయనా అప్పుడప్పుడు విద్యార్థులను కొడ్తాడు. ఔషధప్రాయంగా ఉపయోగించే ఆ తాడనోపాయంతో ఆ విద్యార్థి సక్రమగతిలో పడతాడన్న అభిప్రాయం కలిగితేనే ఆపని జరుగుతుంది.

శ్రీమన్నారాయణ బొమ్మ గీస్తూనేఉన్నాడు. తక్కిన విద్యార్థులు లెక్కలు చేసుకుంటున్నారు.

ఇంతలో గంట కొట్టారు. మాస్టారు లేచి క్లాసు దాటి గుమ్మంఅవతల అడుగుపెడుతూ 'శ్రీమన్నారాయణా! బడి విడిచిపెట్టాక నాదగ్గరకు ఒక మాటురా' అని చెప్పి వెళ్లిపోయారు.

శ్రీమన్నారాయణ తదేకదీక్షతో తాను పుస్తకంలో గీసిన బొమ్మే మరింత అందంగా బోర్డుమీద వేశాడు. ఇందాకా మాస్టారికి సమాధానం చెప్పకుండా పుస్తకంలో ఏంపని చేశాడో ఆపనే అందరికీ తెలిసేటందుకు బోర్డుమీద స్పష్టంగా ప్రకటించాడు.

ఇంకెవరు పొరపాటుపడగలరు?

గుండ్రని అక్షరాలతో ఆ బొమ్మక్రింద 'లెక్కల టీచరు' అని చెక్కేశాడు.

౨

'లెక్కలటీచరు' గారు ఆ పూటంతా శ్రీమన్నారాయణనుగురించే ఆలోచించారు, శ్రీమన్నారాయణకు చదువంటే ఉన్న ఈ అశ్రద్ధకు కారణ మేమిటా అని. ఒక్క లెక్కలలోనే గాదు, ఎందులోనూ అతనికి తెలియకపోవడం లేదు. కాని దేన్నీ అతడు చదవనేచదవడు. చదువు కావాలన్న ఆస్థ లేకపోవడమేకాక ఎందుకన్న నిర్లక్ష్యంగూడా ఉన్నది. ఈ నిర్లక్ష్యం పోగొట్టడానికి ఏం చెయ్యాలి? ఇదీ ఆయనసమస్య.

ఆయన సుమారు ఆరేళ్లబట్టీ ఉపాధ్యాయ వృత్తిలో ఉండి వివిధమనఃప్రవృత్తుల్ని ప్రత్యక్షానుభవంతో పరిశీలించాడు. తాను చదువుకున్న మనస్తత్వశాస్త్రాన్ని వృథాపోనియ్యకుండా ఆ విజ్ఞానం అభివృద్ధి పొందించుకోవడంతోపాటు ఆచరణలోగూడా పెట్టి అనేక క్లిష్టమనస్తత్వాల్నే సరిదిద్దగలిగాడు. అంచేత ఆయనంటే భయంకన్నా గౌరవమే ఎక్కువ పాత

విద్యార్థులకు. అల్లరికుఱ్ఱవాళ్ళకు ఆయనంటే హడలు. చదువుకునే కుఱ్ఱవాళ్లకు ఆయన దేవుడు. ఎంత అల్లరివాడైనా ఆయనదగ్గర ఒక ఏడాది ఉండేటప్పటికి నిజమైన విద్యార్థి అయితీరుతాడు. ఇంత అనుభవమూ కూడా శ్రీమన్నారాయణవిషయంలో ఈ సంవత్సరం ఈ తరగతిలో ఎందుకూ పనికిరాలేదు.

అసలు మొత్తానికి ఈ సంవత్సరం ఈ తరగతిలో చాలామంది విద్యార్థులు ఆయనకు మొదట్లో పెద్ద సమస్యలుగానే కన్పించారు. వాళ్లందరూ శ్రీమన్నారాయణతోపాటు బయటస్కూళ్ళలోనుంచి వచ్చి ఆయేడే చేరారు. వాళ్ళందర్నీ వివిధవిధాలుగా తానెట్లాగో లొంగదీసి చదువంటే శ్రద్ధపుట్టించి వాళ్ళచేత అన్ని విషయాల్లోనూ సరియైన కృషి చేయించగలుగుతున్నాడు. కాని ఈ శ్రీమన్నారాయణే ఇంతవఱకూ లొంగలేదు. ఏ యత్నం చేస్తే లొంగుతాడో బోధపడడమూ లేదు.

ఆయన సాధారణంగా ఎవ్వరినీ కొట్టడు. ఒక విషయం తెలియలేదని విద్యార్థికి తెలిసేటట్లు చెప్పడానికి ఎంత కష్టమైనా ప్రయత్నం చేస్తాడేకాని విసుక్కొని చిరాకుపడి కోపగించి ఇంతవరకూ ఎన్నడూ కొట్టలేదు. ఆక్లాసులో దామోదర్ ఒకమాటు దెబ్బ తిన్నాడు. అంతే! దాంతో వాడు లెక్కల్లో క్లాసంతటికీ మూడవవాడుగా ఉంటున్నాడు. ఆయనే క్లాసుటీచరు కాబట్టి తక్కిన విషయాలు గూడా కనుక్కుంటూ ఉంటాడు. తక్కిన మాస్టర్లందరూ అప్పటినుంచీ దామోదర్ చూపుతున్న శ్రద్ధకు ఆశ్చర్యపడిపోయారు. మొదట్లో ఎందుకూ పనికిరాడనుకొన్న ఈ దామోదర్ యిట్లా ఎందుకు మారిపోయాడో ఇప్పటికీ ఎవ్వరికీ తెలియదు, వాడికీ లెక్కలటీచరుకూ తప్ప. రాజగోపాల్ దెబ్బలు తినలేదుగాని ఒకసారి చీవాట్లు తిన్నాడు. ఆ చీవాట్లు అతని మనస్సును ఎంత కలతపెట్టాయో, ఆపూట అతనికి ఎంతబాధ కలిగించాయో అతనికే తెలియాలి. కాని ఆ నాటినుంచీ ఈ నాటివరకూ అతడు చదువు విషయంలో మాత్రం అశ్రద్ధ చెయ్యనే చెయ్యడంలేదు. కాని అల్లరిలో అమోఘం. ఒక్క లెక్కలటీచరు గారి క్లాసులో మాత్రం చెయ్యడు. ఆయనే అప్పుడప్పుడు 'ఏమోయ్! రాజగోపాల్! నువ్వు గూడా చచ్చుబడి పోతే క్లాసులో ప్రాణమే లేదోయ్! చదువుకు చదువూ ఉండాలి, అల్లరికి అల్లరీ ఉండాలి. పెద్దవాళ్లు అయ్యాక అల్లరి ఎవ్వరూ చెయ్యరు. ఇప్పుడన్నా చెయ్యకపోతే ఎట్లా చెప్పు?' అంటూవుంటారు. ఏమన్నా ఆయనక్లాసులో మాత్రం అతనెన్నడూ చదువు తప్ప మరో విషయం ఎత్తుకోడు. గోడ దెబ్బలూ తిన్నాడు, చీవాట్లూ తిన్నాడు. దాని కనుగుణంగా మారనూ మారాడు. ఇంచుమించు క్రమగతిలోనే ఉన్నాడు. కాని అప్పుడప్పుడు మళ్లీ వెనకడుగు వేస్తూ ఉంటాడు.

ఇట్లాగే ఇంచుమించు తక్కినవాళ్ళందరూ కూడా ఆయన అనుకున్న దారిలో పడ్డారు. ఇక ఎటువచ్చీ ఆయనదృష్టి పడీకూడా ఏ మాత్రమూ మార్పు పొందనివాడు శ్రీమన్నారాయణే! అయితే అతనింతవఱకూ ఆయనచేతిలో దెబ్బలు మాత్రం తినలేదు. ఆ ఉపాయం కూడా ప్రయోగిస్తే ఏమైనా మారుతాడో ఏమో!

ఈరోజుల్లో విద్యార్థులనబడేవాళ్లల్లో చాలామందికి వాళ్లు ఎందుకు బడికి వస్తున్నారో వాళ్లకే తెలియదు. పంపించే తలిదండ్రుల్లో ముప్పాతిక మందికి తమ పిల్లలు పెద్దవాళ్లయి ఉద్యోగాలు సంపాదిస్తారన్న ఆశ తప్ప మఱొకటిలేదు. మిగతా పాతికమందీ మిక్కిలి సంపన్నగృహస్థులై తమతమ పిల్లల్ని అదుపాజ్ఞల్లో పెట్టుకోలేక బడికైనా పోతే వీళ్ల ఇబ్బంది కొంత తగ్గుతుందని పంపుతూ వుంటారు. చదువు కేవలం విజ్ఞానం కోసం, మానవునకు దాన్ని ఆర్జించడం అవశ్యకర్తవ్యం అన్న అభిప్రాయంతో తల్లిదండ్రులూ విద్యార్థులూ ఏకోన్ముఖులై బడిని ఉపయోగించుకునే వారు ఎక్కడో నూటికి ఒకటీ అరా ఉంటారేమో! ఒకవేళ అట్లాంటివాళ్లు కొంత ఎక్కువే ఉన్నా వాళ్లకా విషయంలో తోడ్పడే పాఠశాలలు అసలే లేవు. ఉపాధ్యాయులకు సరియైన అవకాశాలుయివ్వక పోవడంవల్లకేం, ఇచ్చినా ఉపయోగించుకోగల తాహతు

లేనివాళ్లు ఉపాధ్యాయ వర్గంలో చెలామణి అవుతూ ఉండడం వల్ల నేమి ఈనాడు భారత విద్యార్థి లోకానికి జరుగుతూఉన్న అపకారం ఇంతా అంతా కాదు. అసలే మన దేశం బానిసదేశం. అందులో నిరుపేద స్థితి. ఈస్థితిలో చదువుకోడానికి వచ్చే కొద్దిమందికీ మనం అన్యాయం చేస్తే దీని ఫలితం తరతరాలా మన దేశంలో భావిప్రజలు అనుభవించవలసి వస్తుంది. తన జీవితంలో తనకు తెలిసినంతవరకు తా నట్లాంటి అన్యాయానికి పాల్పడగూడదు.

శ్రీమన్నారాయణ ఎందుకు చదువుకోవడం లేదు? అతడు అతని తల్లిదండ్రులకు కడసారి బిడ్డ. అందుచేత గారాబం ఎక్కువ. చదువుకున్న కుటుంబంలో పుట్టాడు గదా, ఇంటికి దగ్గర చదువుకు తగిన వాతావరణం ఉన్నదిగదా, చెప్పితే, బోధపరిస్తే దారికి వస్తాడేమో అన్న ఉద్దేశంతో తా నిదివరకు అనేక పర్యాయాలు చెప్పడం అయింది. ప్రత్యేకంగా అతన్ని దగ్గర కూర్చోబెట్టుకొని కథలూ కబుర్లూ చెప్పి, ఇల్లాంటి వనేక విషయాలు నువ్వు చదువుకోవచ్చు, వాటిని చదువుకోడానికి భాషా పరిజ్ఞానం కావాలి. అంచేత తెలుగూ, ఇంగ్లీషూ శ్రద్ధగా చదువు' అని చిలకకి చెప్పినట్లు చెప్పాడు. అతనికి అందుబాటులో ఉండే చిన్నచిన్న పుస్తకాలు అనేకం లైబ్రరీలో నుంచి తీసి ఇచ్చాడు. లెక్కలు, సైన్సు ఇట్లాంటివి మూలసూత్రాలైనా తెలియకపోతే భావిజీవితంలో కలిగే కష్టనష్టాలన్నీ వివరించి చెప్పాడు. అన్నయ్యల ఆదర్శం చూపించి నువ్వు వాళ్ళకంటే ఎందుకు తక్కువైపోవాలి అని పౌరుషం కలిగించాడు. అయినా లాభం లేకపోయింది. ఇప్పుడేం చెయ్యాలి? ఇతని తెలివితేటలు చదువుగాని, మఱొక వ్యాసంగం గాని ఏదైనా నిర్మాణాత్మకమైన కార్యక్రమంలో పడితే దేశానికి తప్పక ఉపయోగిస్తాయి. ఈ ఉత్సాహాన్ని, ఈ యువకరక్తాన్నీ పసితనంలో ఆనకట్టవేసి క్రమగతిలో నడిపించకపోతే ఇదంతా ఏ మోసంలోనో, దొంగతనంలోనో పరిణతి పొంది లోకాపకారకం అయిపోతుంది. ఇతన్ని లొంగదియ్యడానికి ఒకే ఒక మార్గం ఉన్నది. ఇంకా ఉపేక్షవహించి ప్రయోజనం లేదు. అతని కేవిధంగానైనా చదువుమీద శ్రద్ధ కలిగించడమే ముఖ్యలక్ష్యమయితే దాన్ని సాధించడానికి దెబ్బలైనా ఇచ్చి తీరవలసిందే!

ఇంతలో ఒంటిగంట బెల్లు కొట్టివేశారు.

పిల్లలందరూ ఎక్కడి వాళ్ళక్కడికి వెళ్ళి పోతున్నారు. లెక్కల మాస్టారు ఉపాధ్యాయుల గదిలో శ్రీమన్నారాయణకోసం పావుగంటపైగా ఎదురుచూచి ఇవే ఆలోచనలతో ఇంటికి వెళ్లిపోయారు.

3

శ్రీమన్నారాయణ ఆమధ్యాహ్నం బడికివెళ్లాడో లేదో కాని లెక్కలమాస్టారు అతన్ని కలుసుకోవడం మాత్రం పడలేదు.

మర్నాడు లెక్కల క్లాసులోకి శ్రీమన్నారాయణ వచ్చాడు. అతన్ని ప్రత్యేకం పిలిచి 'వాళ్లందరూ ఒకటి. నువ్వొక్కడివీ ఒకటి! నీ కివ్వాళిటినుంచీ ప్రత్యేకంగా లెక్కలు చెప్తాను. పుస్తకం తెచ్చుకో!' అన్నారు. శ్రీమన్నారాయణ వెళ్లి పుస్తకం తెచ్చుకున్నాడు. మాస్టారు ఒక మాదిరిలెక్క చెప్పి అట్లాంటి లెక్కలు అరడజనుచూపించి వాటిని చెయ్యమన్నారు. శ్రీమన్నారాయణ చేస్తున్నట్లు కూర్చుండగా లెక్కల మాస్టారు తక్కిన క్లాసంతకూ క్రొత్తపాఠం చెప్పారు.

పిరియడు ఇంకా పదినిమిషాలు ఉండనగా శ్రీమన్నారాయణదగ్గరకు వచ్చారు. పుస్తకం చూశారు. రెండు లెక్కలు రైటు చేశాడు. ఇకామీద పుస్తకంలో లెక్కలు చెయ్యలేదు. నిన్నటిమాదిరి బొమ్మలూ వెయ్యలేదు. క్లాసులో తన స్నేహితులకూ, బళ్లో తనకు అత్యంతం ఇష్టులైన మాష్టర్లకూ తాను పెట్టుకున్న ముద్దుపేర్లన్నీ ఒకొ్కక్కటీ అతిసుందరంగా అలంకరించి వ్రాశాడు. ఆమీద పెన్సిలూ, పెన్నూ రెండూ జోడించి పిచ్చిగీతలు గీస్తున్నాడు. ఆ స్థితిలో పుస్తకం మాస్టారిచేతిలోకి వచ్చింది.

మాస్టారు తాపీగా శ్రీమన్నారాయణముఖంవంక చూచాడు. అతను మెల్లగా భయంనటిస్తూ లేచి నిల్చున్నాడు.

'ఏమిటిదంతా?'

సమాధానం లేదు.

'నిన్ను చెయ్యమన్న దేమిటి?'

'లెక్కలు సార్'

'ఎందుకు మానేశావ్?'

సమాధానం లేదు. మాస్టారు కోపాన్ని ప్రకటించలేదు. కాని చెంపమీద ఒక్క దెబ్బ వేశారు. పాపం! గట్టిగానే తగిలిందేమో - కళ్లవెంబడి నీళ్లు పెట్టేశాడు. కాని లోపల్లోపల అహంకారంమాత్రం బాగా ప్రజ్వలించింది.

'నన్నెందుకు కొట్టాలండీ మీరు?'

'ఎందుకు కొట్టానో నీకు తెలియదూ' అంటూ మాస్టారు మళ్లీ ఇంకోటి రెండో చెంపమీద వేశారు.

దీంతో శ్రీమన్నారాయణ తప్పకుండా అణిగిపోతా డనుకున్నారు మాస్టారు.

కాని, శ్రీమన్నారాయణ ఆవేద్పుగొంతుతోటే 'మీకూ తెలుస్తుందిలెండి' అంటూ సరాసరి వెళ్లిపోయాడు బయటికి.

క్లాసులో పిల్లలందరూ ఏమౌతుందో తెలియక రోమాంచంతో నిర్ఘాంతపోయి చూస్తున్నారు.

లెక్కలమాస్టారుమాత్రం ఏమాత్రమూ కళవళపడకుండా మర్నాటికి విద్యార్థులు చేసుకురావలసిన అభ్యాసం చూపించి, అంతలో బెల్లు కొట్టడంవల్ల వెళ్ళిపోయారు.

లెక్కలమాస్టారి చేతిలో దెబ్బతిన్నవాడు ప్రతివాడూ అణిగిపోయినవాడేగాని ఇల్లా ఎదిరించిన వాడెవడూ ఇంతవరకూ ఆస్కూల్లో లేడు. శ్రీమన్నారాయణ ఈపని చెయ్యడంతో క్లాసులో చాలామందికి— అందులో ఇదివఱకు ఆయనచేత దెబ్బలుతిన్న కొత్త కుఱ్ఱవాళ్లకు వాడొక మహావీరుడిలాగ కనిపించాడు.

తర్వాత పిరియడు తెలుగు. ఆయన ఆనాడు సెలవు. అంచేత ఇంకా వేరేమాస్టరు ఎవరూ రాలేదు. మానిటరే క్లాసు అల్లరిచెయ్యకుండా చూస్తున్నాడు. పావుగంటసేపైంది. లెక్కల మాస్టారు హెడ్మాస్టరు గదిలోకి వెళ్లివచ్చారన్నవార్త అప్పుడే ఎట్లా అందిందో అందింది. కుఱ్ఱవాళ్ళంతా లోపల్లోపల గుసగుసలాడుతున్నారు. ఇంతలో శ్రీమన్నారాయణ రానే వచ్చాడు నవ్వుకుంటూ. వచ్చీరావడంతోటే 'ఒరేయ్ గాడా! నువ్వు పోయి గుమ్మందగ్గఱ నుంచోరా, ఎవరైనా వస్తుంటే లోపలికి వచ్చెయ్' అన్నాడు. శ్రీమన్నారాయణ అంటే ఎవ్వరికీ గౌరవం లేదుకాని ఎంత పెద్ద కుఱ్ఱాడికైనా భయంమాత్రం ఉన్నది. గాడ మారు మాట్లాడకుండా వెళ్లి నిలబడ్డాడు. శ్రీమన్నారాయణ క్లాసుకంతకూ హితబోధ చెయ్యడం మొదలుపెట్టాడు.

'మెట్టవంకాయ' ఇవ్వాళ తన్నుకొట్టాడు. రేపు ఇంకొకరిని కొట్టవచ్చు. ఇదివఱకు ఎంతమందినో కొట్టాడు. ఇట్లా అందరినీ కొట్టుతూఉంటే విద్యార్థులు చేతకాని దద్దమ్మల్లాగా పడిఉండాల్సిందేనా? అసలు మాస్టరుకు విద్యార్థిని కొట్టేందుకు హక్కు లేదు. మాస్టర్లకి ఇచ్చే జీతాలు విద్యార్థులు కట్టే సొమ్మే. అంటే విద్యార్థికింద మాస్టరు జీతగాడన్నమాట. జీతగాడు యజమానిని కొట్టడమంటే ఎంత అవమర్యాదో తెలుసుకోలేకపోతున్నారు విద్యార్థులు. విద్యార్థులందరూ ఏకమైనట్లయితే ఈ 'మెట్టవంకాయ'ని అవమానం చెయ్యడమేగాక వాడికిఉద్యోగంకూడాలేకుండా చేసిపారెయ్యవచ్చు. వాళ్ళంతట వాళ్లేమీ చెయ్యలేకపోయినా సరే తాను చేసేపనికి అడ్డురాకుండాఉంటే చాలు వీడికి బుద్ధిచెప్పేపని తనది.

ఇల్లా ఉపన్యాసం సాగిపోతోంది. కొందరికి శ్రీమన్నారాయణధోరణి చాలా అసహ్యం వేసింది. వాళ్ళందరికీ లెక్కలటీచరు అంటే అపరిమితమైన గౌరవం. ఆయన తక్కిన మాస్టర్లవలె పాఠం తెలియకపోతే కొట్టడు. ఎన్నిసార్లు అడిగినా విసుక్కోడు. అడగాలి, తెలుసుకోవాలి అన్న శ్రద్ధ ఉంటేచాలు నెత్తి కెక్కించుకుంటాడు. పాఠం చెప్పడంకూడా చాలా సర్దాగా చెప్తాడు. చాలామంది చెప్తుంటే విసుగుపుట్టే లెక్కలు ఈయన చెప్తుంటే ఎంతో హుషారుగా ఉంటుంది. రోజల్లా లెక్కలే ఉంటే బాగుండునురా అని కూడా అనిపిస్తుంది. అట్లాంటి టీచరును పట్టుకుని వీడిట్లా కూస్తూఉంటే వాళ్లకు దుర్భరమైపోతోంది. కాని అట్లాంటివాళ్లు

క్లాసులో నలభైమందికీ పండ్రెండుమందికూడా లేరు. ఒక్క అరడజనుమందికి శ్రీమన్నారాయణతో సంపూర్ణాంగీకారం కుదిరిపోయింది. ఆ అరడజనుమందీ వీలు చిక్కితే లెక్కలటీచరును పట్టుకుని కొట్టాలన్న నిశ్చయానికిగూడా వచ్చారు. తక్కినవాళ్లల్లో చాలామందికి ఈయనబాధ అయితే తప్పించుకోవాలని ఉన్నదికాని వీడి ప్రసంగం మరెవరైనా వింటే క్లాసంతటినీ ఏం చేస్తారో అన్న భయంతో దిక్కులు చూస్తున్నారు.

ఇంతలో గాడ చటుక్కున లోపలికి వచ్చేశాడు.

శ్రీమన్నారాయణ తన చోట్లో తాను ఏమీ ఎరగనట్లు కూర్చున్నాడు. రెండునిమిషాలసేపు క్లాసు అంతా అతినిశ్శబ్దంగా ఉంది. శ్రీమన్నారాయణ గుమ్మంవైపు చూచి 'నాదగ్గర వేళాకోళా లాడతావా?' అని గాడను వీపుమీద ఒక్క చఱుపు చరిచాడు. ఆ దెబ్బ మోత ఇంకా ఆగలేదు, కాని హిస్టరీమాస్టారు లోపలికివచ్చేశారు. శ్రీమన్నారాయణ గాడను కొట్టింది ఆయన చూచాడుకూడా! కాని ఆయన ఆవిషయంలో ఏమీ జోక్యం కలిగించుకోలేదు.

౪

ఆరోజల్లా లెక్కలటీచరు మనస్సులో చాలా బాధపడ్డాడు. శ్రీమన్నారాయణను బాగుచెయ్యాలన్న ఉద్దేశంతో అతన్ని కొట్టక ముందు ఎంత బాధపడ్డాడో దానికి రెట్టింపు అనుభవించాడు, అతని విషయంలో ఏం చెయ్యాలో తోచక. హెడ్మాష్టరు చెప్పినదానికి ఆయనేమీ లెక్క చెయ్యనేలేదు. నిబంధనలప్రకారం విద్యార్థిని జరిమానా వేసిగాని, క్లాసులోనుంచి బైటకు పంపించిగాని మామూలుమాష్టరు శిక్షించవచ్చు. దెబ్బలు కొట్టి శిక్షించడానికి ఒక్క హెడ్మాష్టరుకే అధికారం ఉంది. వాణ్నీ వీణ్నీ కొట్టినా పర్వాలేదుగాని జిల్లామునసబు కొడుకును కొట్టితే! ఒకవేళ ఆయన ఏమైనా చర్య తీసుకునే సందర్భంలో హెడ్మాష్టరు తనకేమీ సహాయకారి కాలేడు. ఇదీ ఆరేళ్ల అనుభవం ఉండి విద్యార్థిని కొట్టడం తప్పుగా భావించి తప్పనిసరైతేనే దాన్ని ప్రయోగిస్తాడన్న విశ్వాసం విద్యార్థులకే కలిగించిన ఉపాధ్యాయుణ్ని తన గదిలోకి పిలిపించి హెడ్మాష్టరు చెప్పింది.

లెక్కలటీచరు మనస్సులో పడ్డ బాధ అంతా శ్రీమన్నారాయణను ఎట్లా బాగుచెయ్యడమా అనేగాని దీన్నిగురించి కానేకాదు. వాణ్ని మళ్ళీ కలుసుకుందామనుకున్నాడుగాని ఆయనకు అతను కనబడనేలేదు. హెడ్మాష్టరు ఆయనతో చెప్పిన విషయం ఎట్లా ఊహించాడో ఏమో వాడుమాత్రం పట్టపగ్గాలు లేకుండా విద్యార్థులలో స్కూల్లో ఉన్నంతసేపూ రెచ్చిపోయాడు. అవును, జిల్లామునసబు కొడుకాయె! ఏంచేసినా చెయ్యగలడు. తక్కినమాష్టర్లకూఅదేభయం. వాడేంచేసినా ఏమీ అనరు. దారినిబోయే తద్దినాన్ని ఆహ్వానించుకునే ఈయనకుతప్ప వాడి విషయం ఇతర్లకేం పట్టింది?

తండ్రి ఊళ్ళో లేకపోవడంవల్ల శ్రీమన్నారాయణ జరిగిన విషయానికి అనేకఅబద్ధాలు జోడించి తల్లితో చెప్పాడు. వినయవతియైన ఆ తల్లినుండి శ్రీమన్నారాయణ దౌర్మార్గ్యానికి ఆసరా ఏమీ లభించకపోగా చీవాట్లుగూడా తగిలాయి. అయినా అతని దౌష్ట్యంమాత్రం చప్పబడలేదు.

మర్నాడు ఉదయం మొదటి పిరియడే లెక్కలు. శ్రీమన్నారాయణ చాలా హుషారుగా బడికి వెళ్లాడు. క్లాసులోకి వెళ్లడంతోటే తాను చెయ్యదలచుకున్న పని పిల్లలకందరికీ చెప్పాడు. కొందఱు అట్లా చెయ్యడం మంచిది కాదన్నారు. మాస్టారికి కోపం వచ్చి అందర్నీ పట్టుకు కొట్టుతారేమో అన్నారు కొందరు. శ్రీమన్నారాయణతో పూర్తిగా ఏకీభవించిన పెద్దకుఱ్ఱాళ్లు 'అందర్నీ కొట్టడం మాటలా ఏమిటోయ్! నిన్న ఒకణ్ని కొట్టినందుకే చీవాట్లు తిన్నాడు. ఇవ్వాళ ఏమీ చెయ్యలేడు. మనస్సులో కుళ్లికుళ్ళి చస్తాడు. వాణ్ణి అట్లా ఏడిపించాల్సిందే! లేకుంటే వాడి కంత పొగరా! ఈ దెబ్బతో మళ్ళీ ఎవణ్నీ చెయ్యిచేసుకోడు. చేసుకున్నాడా, ఇంకేముంది, బలే జల్సా! స్కూలు స్కూలు అంతా మనరూము దగ్గరకే వస్తుంది. శ్రీమన్నారాయణా! నీ పని నువ్వు చెయ్యి! వీళ్ళే

మన్నా పాకా్కరంటే తగిన శాస్తి చేసే బాధ్యత మాది' అని అతనికి హుషారూ ఇచ్చారు, ధైర్యమూ చెప్పారు. ఇక శ్రీమన్నారాయణకు పట్టలేనంత సంతోషం కలిగింది. తక్కిన కుర్రాళ్లు కుక్కిన పేలల్లే నోరు కదపలేరు.

రెండో బెల్లు పూర్తికాక ముందే శ్రీమన్నారాయణ తాను చెయ్యదలచుకొన్న పని చేసేశాడు. వాళ్ళ క్లాసు గది ఒకమూల ఉండడంవల్ల వాడానాడు చేసిన పని తక్కిన మాస్టర్ల కెవరికీ చూసే అవకాశం కలగక పోయింది.

మూడో బెల్లు కూడా కొట్టారు. లెక్కల మాస్టారు మామూలుగా సుద్దముక్కలూ, డస్టరూ పుచ్చుకొని పాఠంచెప్పే మనస్థితితో సరాసరి క్లాసులోకి వచ్చి కుర్చీలో కూర్చుని హాజరుపట్టీ వెయ్యడానికి పూనుకున్నారు. పేర్లు పిలుస్తుంటే అక్కడక్కడ కొంచెం గుసగుసలూ, నవ్వులూ వినవచ్చాయి. మాస్టారు తల ఎత్తేటప్పటికి అంతా నిశ్శబ్దమయిపోయింది. హాజరుపట్టీ వెయ్యడ మయ్యాక శ్రీమన్నారాయణను పుస్తకం తెమ్మన్నారు మాస్టారు. జంకూ గొంకూ లేకుండా శ్రీమన్నారాయణ పుస్తకం తెచ్చాడు.

'నిన్న చెయ్యాలి లెక్కలు పూర్తి చేశావా?'

'లేదండి'

'ఇందుకే నిన్న కొట్టింది, ఇవ్వాళ మళ్ళీ కొట్టుతున్నదీని' అంటూ మాస్టారు గట్టి లెంపకాయ ఒకటి అంటించారు.

శ్రీమన్నారాయణకు కళ్ళల్లో నీళ్ళే కాదు, కాలికింద నేలకూడా గిరగిరా తిరిగిపోయింది. హెడ్మాష్టరు చెప్పినా ఈయన ఇట్లా ఎల్లా కొట్టగలుగుతున్నాడో అతని కేమీ బోధపడలేదు. వెంటనే అతనికి హెడ్మాష్టరు చెప్పారని తాను విన్నది అబద్ధమని తోచింది. ఆయనగూడా ఈయనతో కలిస్తే ఇక తన ఆట లేమీ సాగ వనిపించింది. ఈ సందర్భంలో అమ్మ పెట్టిన చీవాట్లు జ్ఞాపకం వచ్చాయి. దాంతో శ్రీమన్నారాయణ మనిషి సగానికి సగం అయిపోయాడు. అనుకున్న దొకటి, అయిం దింకొకటి! ఇంకేం చెయ్యగలడు?

'ఇప్పుడైనా చేస్తావా, మరొకటి కావాలా?'

కళ్ళనీళ్లు తుడుచుకుంటూ 'చేస్తానండి' అని ఎట్లా అనగలిగినాడో ఏమోకాని అనడం మాత్రం అన్నాడు. మాస్టా రిస్తున్న పుస్తకాన్ని తడబడుతున్న చేతుల్తో అందుకొని తన చోట్లో లెక్కలు చెయ్యడానికి కూర్చున్నాడు. కాని అతని గుండెలు ఇకముందేం జరుగుతుందో అని గుభేలు గుభేలు మంటున్నాయి.

అతనితో ఏకీభవించిన అరడజనుమంది కుర్రాళ్లూ అంతకుముందే అణగారిపోయి పుస్తకాలు తెరుచుకొని సిద్ధంగా కూర్చున్నారు. నాయకుడు లొంగిపోయిన సైన్యంవలె అయింది వాళ్ల పరిస్థితి.

మాస్టారు కొత్తపాఠం చెప్పడానికి బోర్డువంకకు తిరిగారు.

చూడగా ఆయనకు అమితమైన ఆశ్చర్యమూ, బాధా ఒక్కమాటుగా కలిగాయి. ఆయన మళ్ళీ క్లాసు వైపు తిరిగి, చేతిలో డస్టరు బల్లమీద పడవేసి కుర్చీలో కూర్చుండి పోయాడు. ఒక్కసారి నుదుటిమీద చెయ్యి వేసుకొని ఒక్క సెకండుకాబోలు ఏదో ఆలోచించాడు. కాని ఆయన తన మనస్సులో కలిగిన ఏభావాన్నీ ముఖంమీద ప్రకటించలేదు. చిరునవ్వు నవ్వుతూ 'ఇవ్వాళ మీకు పాఠం చెప్పను! ఈ పిరియడు కులాసాగా కాలక్షేపం చేద్దాము. అయితే దానివల్ల కూడా మనకు కొంత ఉపయోగం ఉండాలి. అంచేత ఏదో ఒక విషయాన్ని గురించి మనలో మనం చర్చించుకుందాము. ఈ సభకు నేను అధ్యక్షుణ్ని గా ఉండను. నేను కూడా ఒక సభ్యుణ్నిగా మీతోపాటు కూర్చుంటాను. మీరందరూ కలిసి ఒక విద్యార్థి పేరు చెప్పండి. అతన్ని అధ్యక్షుణ్నిగా ఎన్నుకుందాము. విషయం మాత్రం నేను చెప్తాను. దాన్ని గురించి అందరూ ఎవరికి తోచింది వారు మీకు మాస్టరయిన నేను యిక్కడ ఉన్నానని గానీ, ఇది బడి అనిగానీ సంకోచించకుండా మీ మనస్సులో ఉన్నది ఉన్నట్టు చెప్పేసెయ్యాలి! ఏమంటారు? ముందు అధ్యక్షుని పేరు చెప్పండి!' అన్నారు.

ఈమాటలు చాలామంది విద్యార్థుల చెవుల్లో పడ్డాయన్న మాటేగాని వాళ్ళకు నిజంగా అవి వినబడనేలేదు. ఈయన ప్రవర్తనకు వాళ్లంత నిశ్చే

తన్మయులై పోయి తామున్న దెక్కడో కూడా తెలియని స్థితిలో పడిపోయారు. చిన్న ఒకరిద్దరు పెద్ద కుర్రాళ్లూ కూడా 'ఇది ఇంకెందుకో పెద్ద ఎత్తు వేస్తున్నాడురా బాబోయ్' అని అనుకొని నోరు మెదపకుండా తలలు వంచుకు కూర్చున్నారు. ఇదంతా తనమీదే విరుచుకు పడుతుంది, తప్పదు అని శ్రీమన్నారాయణ అణువణువునా గజగజలాడిపోతున్నాడు.

ఎవరిపేరో ఒకరిపేరు చెప్పమని నువ్వు నువ్వని ప్రతివాణ్నీ అడుగుతూ అయిదు నిమిషాలు గడిపారు మాస్టారు. కాని ఎవ్వరూ చెప్పలేదు.

'అయితే అదికూడా నేనే చెప్తాను. ఈ సభకు శ్రీమన్నారాయణ అధ్యక్షత వహిస్తే చాలా బాగుంటుంది. మీ అందరికీ అంగీకారమేనా?'

దీంతో క్లాసులో ప్రతి వాడికీ మరీ హడలెత్తింది. ఆయన మనస్సులోతు గ్రహించే శక్తి ఆ పిల్లల కేం ఉంటుంది పాపం!

'నేను నా తరఫునా, ఫోర్తుఫారం విద్యార్థులందరి తరఫునా, శ్రీ శ్రీమన్నారాయణ గారిని అధ్యక్షత వహించవలసిందిగా ప్రార్థిస్తున్నాను'.

శ్రీమన్నారాయణ కూర్చునే తల వంచేసుకున్నాడు. 'మీరు మఱోకవిధంగా చెయ్యడానికి వీలులేదు! మా ప్రార్థనను అంగీకరించక తప్పదు' అంటూ మాస్టరతన్ని రెండుచేతుల్తోనూ లేవదీసి తీసుకవచ్చి కుర్చీలో కూర్చోబెట్టారు. శ్రీమన్నారాయణకు తరుముకొని తరుముకొని దుఃఖమూ వస్తోంది, ఒకపక్క కొద్దిగా సంతోషం లాంటి దేదోగూడా కలుగుతోంది. కుర్చీలో కూర్చున్నాడన్న మాటేగాని ఇంతకూ తలయెత్త లేకపోతున్నాడు.

'ఈనాడు మనకు చర్చనీయాంశం ఈ బోర్డు మీద ఉన్నదానికి సంబంధించిందే! అంచేత దాన్ని అధ్యక్షులవారు సభకంతకూ ఒకమాటు చదివి వినిపిస్తారు.' అని అంటూ చిట్టచివరి పంక్తిలో విద్యార్థులపక్క బల్లమీద కూర్చున్నారు.

శ్రీమన్నారాయణ ఇంకా తల ఎత్తి లేదు. అతనికేం చెయ్యాలో ఏమీ తోచడంలేదు.

'అధ్యక్షుల వారు ఆలస్యం చేస్తే వీల్లేదు. మనకున్న వ్యవధి చాలా తక్కువ' అని మాస్టారు మళ్ళీ హెచ్చరించారు.

ఇప్పటికి క్లాసులో చాలామందికి దిక్కు తెలియనితనం పోయి జరుగుతున్న దేదో తెలుసుకునే స్థితి వచ్చింది.

'ఇంకా లేవరేం అధ్యక్షుల వారు?' అని మాస్టారు ఇంకోమాటు అనడంతో క్లాసు అంతా ఒక్కమాటు నవ్వారు. దాంతో శ్రీమన్నారాయణకు లేవక తప్పిందికాదు. కాని అతను బోర్డువంకకు చూడ లేకపోతున్నాడు.

'అవసరమని తోస్తే అధ్యక్షుల వారు దాన్ని చదవడానికి ఎవరి సహాయమైనా పుచ్చుకోవచ్చు. పోనీ నన్ను చెయ్యమంటారా?'

శ్రీమన్నారాయణ చచ్చేటంత సిగ్గుతో అంగీకారసూచకంగా తల ఆడించి వంచేసుకున్నాడు.

మాస్టారు చదివారు.

'లెక్కల మాస్టారూ!

మీరు మమ్మల్ని ఇకముందు కొట్టినట్లయితే మేము మిమ్మల్ని కొట్టగలము.

ఫోర్తు ఫారమ్ విద్యార్థులు'

దీన్ని చదివేసి మాస్టారు ఊరుకోలేదు.

'ఇల్లా ఉన్న విషయాన్ని గూర్చి సభ్యులు మాట్లాడలేరేమో అని నాకు అనుమానం కలుగుతోంది. దీన్ని కొంచెం స్పష్టంచేసి మరొక విధంగా చెప్తాను. 'ఉపాధ్యాయుడు విద్యార్థిని కొట్టవచ్చునా, కొట్టగూడదా?' విషయాన్ని ఈ విధంగా నిర్ణయించుకుంటే అందరికీ అందుబాటులో ఉంటుం దనుకుంటాను. కాని మరొక విషయం మనవి చెయ్యాలి. అధ్యక్షులవారు కేవలం ముఖావం వహించి అంతపనీ నాచేతే చేయిస్తున్నారు. ఇకమీద నేనేమీ చెయ్యను కాబట్టి అధ్యక్షుల వారు ఉత్సాహంతో ఈ సభను కొనసాగిస్తారని ఆశిస్తున్నాను'.

ఈ మాటలు విని క్లాసంతా మళ్ళీ ఒక మాటు గొల్లుమని నవ్వారు. ఈ మాటు శ్రీమన్నారాయణకు

కూడా నవ్వువచ్చింది. అతని కిప్పటికి పోయిన ధైర్యం కూడా క్రమక్రమంగా వచ్చి చేరుకుంది.

శ్రీమన్నారాయణ లేచి నిల్చుని 'ఈ విషయంలో ముందు మాస్టారు వచ్చి మాట్లాడితే బాగుంటుందనుకుంటాను' అంటూ సగంసగం మాటలు మింగుతూ అన్నాడు.

'ఇప్పుడు నేను మాస్టర్నికాను. నేనూ మీలో ఒకణ్ణే. కాని అసలు ప్రస్తావన తెచ్చింది మీరు కాబట్టి, మీచర్చ అంతా విన్నాక సభ పూర్తిచేసిం తర్వాత నా ఉద్దేశాలు నేను చెప్తాను' అని ఊరుకున్నారు మాస్టారు.

తర్వాత విద్యార్థులు ఒకరొకరే వచ్చారు. కొందరేమీ చెప్పలేక 'అధ్యక్షా! సోదరులారా! ఇవాళ విషయం ఉపాధ్యాయుడు విద్యార్థిని కొట్టవచ్చునా కొట్టగూడదా అనునది. నా అభిప్రాయం కొట్టగూడదు అని. ఇంతటితో నేను విరమిస్తున్నాను'. అని మాత్రం చెప్పి వెళ్లిపోయారు. మరికొందరు ఎంత బలవంతం చేసినా వాళ్ల చోటుల్లోనుంచే కదలలేదు. చివరకి కొట్టవచ్చునని ఇద్దరున్నూ, కొట్టగూడదని నలుగురున్నూ వాళ్ళకు వాళ్లకు తోచిన కారణాలతో కొంచెం సేపు మాట్లాడారు. కొట్టగూడదని చెప్పినవాళ్లు ఇంచుమించు ఇదివరకు శ్రీమన్నారాయణ క్లాసులో చెప్పిన ఉపన్యాసపు సారాంశమే వెలిబుచ్చారు. కాని వాళ్లందరూ కూడా లెక్కల మాస్టారు చాలా బాగా చెప్తారనీ, కొట్టడం మానేస్తే ఇంకా చాలా బాగుంటుందనీ సలహా యిచ్చారు. కొట్టవచ్చునని చెప్పినవాళ్లు మాస్టరు లెక్కలమాస్టరు లాంటివాడైతేనే కొట్టవచ్చునన్నారు. అంటే వాళ్లఉద్దేశ్యం చెప్పినపాఠం చదవక అశ్రద్ధచేస్తే తప్పకుండా కొట్టవచ్చునని. సభను ముగిస్తూ శ్రీమన్నారాయణకూడా రెండు ముక్కలు చెప్పాడు. 'ఏమీ చేతకాని నన్ను మాస్టారు అధ్యక్షుణ్నిగా ఉండమన్నారు. ఇందులో నేనేమైనా తప్పులు చేసిఉంటే వాటి నన్నిటినీ ఆయన క్షమిస్తారని అనుకుంటున్నాను.' అని తన చోటులోకి పోయి కూర్చున్నాడు.

ఇంతలో మొదటి పిరియడు అయిపోయింది. తర్వాత పిరియడు మాస్టా రింకా రాలేదు. లెక్కల మాస్టారు క్లాసును మానిటరు కప్పగించి హెడ్మాష్టరు దగ్గరికి వెళ్ళారు.

క్లాసులో అందరూ తల కొకవిధంగా అనుకున్నారు. హెడ్మాష్టరుతో కొందరిమీద రిపోర్టు చేస్తాడనీ, శ్రీమన్నారాయణను బళ్లోనుంచి పంపించేస్తాడనీ ఇట్లాగే ఏవేవో అనుకున్నారు. శ్రీమన్నారాయణమాత్రం ఆయ నటు వెళ్లిందే తడవుగా డస్టరు పుచ్చుకుని బోర్డంతా శుభ్రంగా చెరిపేశాడు. 'ఇంత మాత్రానికేనా అన్నికబుర్లు' అని వేళాకోళంచేసిన ఒకరిద్దరి ముఖాలకూ ఆ డస్టరుతో వెల్లవేశాడు కూడా.

ఇంతలో మళ్లీ లెక్కల మాస్టారే వచ్చారు.

ఆయన కుర్చీలో కూర్చుని చెప్పిన మాట లివి:

'ఇవాళ ఈ పిరియడుకూడా నేనే తీసుకుంటాను. ఈ విషయం చెప్పిరావడానికే నేను హెడ్మాష్టరుదగ్గరకు వెళ్లాను.

నేను ఉపాధ్యాయవృత్తిలో ప్రవేశించి ఇప్పటికి ఆరు సంవత్సరా లైంది. అప్పటినుంచీ ఇప్పటివఱకూ నాప్రయత్నం అంతా నిజమైన ఉపాధ్యాయుణ్నిగా పనిచేయడానికే! కాని, నిజమైన ఉపాధ్యాయుడంటే ఎవరు? తనదగ్గఱకు వచ్చిన ప్రతివిద్యార్థికీ చదువుమీద శ్రద్ధకలిగించి చదివించగలిగినవాడే నిజమైన ఉపాధ్యాయుడు. ఉపాధ్యాయుడు విద్యార్థి ఇచ్చే జీతంవల్ల బ్రతుకుతున్నాడన్న మాటలో యథార్థం లేకపోలేదు. కాని మీ రందరూ ఒక విషయం గ్రహించాలి. మీరు యజమానులు. ఉపాధ్యాయులు మీ సేవకులు. మీ యాజమాన్యం మీ తల్లిదండ్రుల దగ్గఱనుండి డబ్బుతీసుకు వచ్చి ఇచ్చేవఱకేగాని ఆపైన మీసేవకుల చేత ఏంపని చేయించుకోవాలో, ఎట్లా చేయించుకోవాలో మీకు తెలియదు. క్లాసులో అందరికీ ఒకవిధంగా చదువురాదు. చాలామంది ఉపాధ్యాయులు పిరియడు కింత అని పాఠంచెప్పి ఎవడికి వచ్చినా రాకపోయినా తమదారిని తాము పోతూఉంటారు. అట్లాంటివాళ్లను చూచి మీరు చాలా మంచివాళ్లనుకుంటూ ఉంటారు. బజారులోకివెళ్లి కొట్టువాడు పుచ్చువంకాయలు ఇస్తే పుచ్చుకోని మీరు మాస్టరు మీకు తెలిసేటట్లుపాఠం చెప్పకపోతే లెక్కచెయ్యరేం? మీ రెందు కిక్కడికి

వస్తున్నారో, మీరు ఖర్చుపెట్టే సొమ్మూ, కాలమూ, వీటివిలువ యేమిటో, మీ భావిజీవితాలు ఈవయస్సులో మీరుచేసే పనులమీద ఎంత ఆధారపడిఉన్నాయో మీకు బొత్తిగా తెలియదు. మిమ్మల్ని చూస్తే నాకు కోపం రావడం లేదుగాని జాలివేస్తోంది. నా సంగతి నాకంటే గూడా మీకే ఎక్కువ తెలుసు. నే నెప్పుడైనా ఎవరిని ఎందుకు కొట్టానో మీకు తెలియంది కాదు. నా ఆశ ఒక్కటే! మీలో ప్రతిఒక్కరికీగూడా చదువు విలువ తెలియాలి, దానియందు ఆసక్తి కలగాలి, అభ్యసించాలి, అభివృద్ధి పొందాలి. సృష్టిలో ప్రతివాడికీ కూడా ఏచదువుగాని చెప్పేవిధంగా చెప్పితే రాకుండా ఉండడానికి వీల్లేదని నా పరమమైన విశ్వాసం. అంచేతనే నేను నాకు తెలిసినంతలో ఒక్కొక్క విద్యార్థికీ ఒక్కొక్క విధంగా చెప్పుతూఉంటాను. మూడువందల యేండ్లకు పైగా బానిసతనం అనుభవిస్తున్న మన దేశం బాగుపడాలంటే ప్రతియువకుడూ నిజమైన విద్యావంతుడు కావాలి. మాస్టర్ల చేత మార్కులు వేయించుకుని ప్యాసయీ, కాపీలుకొట్టి ప్యాసయీ మీరు లోకాన్నే కాక మిమ్మల్నిగూడా మోసంచేసుకుంటున్నారు. ఇప్పుడు మన శ్రీమన్నారాయణ విషయమే చూడండి, ఎక్కడో థర్డుఫారమ్ ప్యాసయివచ్చి ఇక్కడ చేరాడు. అత నెట్లా ప్యాసయ్యాడో అతనికే తెలియాలి. ఇప్పటికి నాలుగు నెలలైంది ఈబళ్లో చేరి. వచ్చినదగ్గరనుంచీ నా అభిప్రాయాలన్నీ అతనితో చెప్పుతూనేఉన్నాను. తెలివిగలవాడుగదా, చెప్పితే చాలు అన్న ఉద్దేశంతో ఎన్నెన్నివిధాల చెప్పానో, నాకంటే మీ అందరికీ అతను చెప్పితేనే బాగుంటుంది. అతనికి చదువుమీద ఆసక్తి కలగాలని అనేకపుస్తకాలు తీసిఇచ్చాను. కాని అతను వాటిని చదవలేదు సరిగదా కొన్నిటిని చించిగూడా తెచ్చాడు. అతని విషయంలో ప్రతిరోజూ క్లాసులో ఏం చెప్పుతున్నానో, ఏం చేస్తున్నానో అవంతా మీ అందరికీ తెలుసు. ఇన్నిరోజులబట్టీ ఆలోచించిఆలోచించి అతనికి శ్రద్ధ కలిగించేందుకు మరేఉపాయమూ తోచక నిన్నను మొదటిమారు చెయ్యిచేసుకున్నాను. దానికి ఫలితంగా అతడు ఏవిధంగా ప్రవర్తించాడో మీకు తెలుసు. అత డల్లా అన్నందుకు నాకేమీ కష్టం కలగలేదు. కాని అతడేంచేస్తే మార్పు పొందుతాడో తెలియక చాలా బాధపడ్డాను. ఇవ్వాళ క్లాసులోకి వచ్చేటప్పటికి మీ రీపని చేశారు. ఇది ఎవరుచేశారన్న ప్రశ్నతో నాకేమీ అవసరంలేదు. అది క్లాసులో బోర్డుమీద వ్రాసిఉన్నదికాబట్టి క్లాసంతా ఆ విషయాన్ని అంగీకరించినట్లే లెక్క. అంచేత మీరందరూ ఒక్కవిషయంమాత్రం తెలుసుకోవాలని నా ప్రార్థన. నే నీఉద్యోగం చేస్తున్నది కుఱ్ఱవాళ్లను కొట్టడానికికాదు—కుఱ్ఱవాళ్లకు చదువుచెప్పడానికి. చదువుకోవడానికి ఇష్టంలేనివాళ్లు ఇక్కడికిరావడానికి వీల్లేదు. వాళ్లకు తెలియక వాళ్లు వస్తే వాళ్లకుగూడా చదువు చెప్పవలసిన బాధ్యత నామీద ఉన్నది. ఆ లక్ష్యం సాధించడానికి అవసరమైతే దెబ్బలుకొట్టడానికిగూడా నాబాధ్యతనుబట్టే నాకు హక్కుఉంది. నా ఉద్యోగం ఉంటుందా ఊడుతుందా అన్నదాంతో నాకేమీ సంబంధంలేదు. ఉద్యోగంలో నేను ఉన్నంతవఱకూ నాధర్మం నేను నిర్వర్తించవలసిందే!

మీ రందరూ మీ మనస్సుల్లో ఉన్న అభిప్రాయాల్ని నిర్భయంగా ప్రకటించగలిగినందుకు మీ అందరికీ నా ధన్యవాదాలు.

నేను చేసినపనికి మీఅందరికీ ఇంకా కోపంగా ఉండి నన్ను కొట్టదల్చుకున్నట్లయితే నిరభ్యంతరంగా కొట్టవచ్చు.'

ఈ ఉపన్యాసం వింటున్నంతసేపూ శ్రీమన్నారాయణ నిలువునా నీరైపోతూనేఉన్నాడు. ఉపన్యాసం పూర్తికావడంతోటే వెక్కివెక్కి ఏడుస్తూ 'క్షమించండి మాస్టారూ!' అంటూ ఆయనకాళ్లమీద పడ్డాడు.

అంతే! ఆనాటినుంచీ ఆ స్కూల్లో అన్ని విషయాల్లోనూ ఆ క్లాసే ప్రథమం. ఆ క్లాసంతటిలోకీ శ్రీమన్నారాయణే మొదటివాడు.

ఇప్పుడు లెక్కలమాస్టారు కొట్టడంలేదు. నెలకొకనాడైనా క్లాసుకు సంబంధించిన ఏదో విజయాన్ని పురస్కరించుకుని విందులూ బహుమతులూ ఏర్పాటు చేస్తున్నారు.

దీన్నిగురించి అపార్థాలు తియ్యడంలో నిమగ్నులైన పెద్దలు లేకపోలేదు. కాని ఎవరు నిజమైన ఉపాధ్యాయులో శ్రీమన్నారాయణకే తెలుసు.